సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
గురువారం | 3 | ఏప్రిల్ | 2025



ఎటు చూసినా..ఎర్ర బంగారమే!
వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం 95వేలకు పైగా మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. - 8లో▸



గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి
అటవీ ప్రాంతంలోని గొత్తికోయ గూడేల్లో నివసిస్తున్న గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సీతక్క తెలిపారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
$35^0/24^0$
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

భద్రకాళి అమ్మవారికి మల్లెలతో పుష్పార్చన



హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం మల్లెపూలతో అమ్మవారికి పుష్పార్చన నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి పూర్ణాభిషేకం, నిత్యాహ్నికం నిర్వహించారు. అనంతరం వేద పండితులు, వేద పాఠశాల విద్యార్థులు మల్లెపూలకు సంప్రోక్షణ నిర్వహించి వాటితో అమ్మవారికి లక్షపుష్పార్చన నిర్వహించారు. పుష్పార్చనకు న్యాయవాది భాస్కరవజ్జుల పురుషోత్తం భవాని దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈఓ శేషుభారతి, సిబ్బంది పర్యవేక్షించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ (అటానమస్)లో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల నిర్వహణ తీరును కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, ఆ కాలేజీ పరీక్షల నియంత్రణాధికారి సుధీర్ అధ్యాపకుడు సాయిచరణ్ పరిశీలించారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు కొనసాగాయి.

ఫాలో అప్ సేవలు ముఖ్యం



ఎంజీఎం: బీపీ, షుగర్ ఉన్న పేషెంట్లకు సరైన మందులు అందిస్తున్నట్లుగానే వారికి ఫాలో అప్ సేవలు కూడా ఎంతో ముఖ్యమని హనుమకొండ వైద్యారోగ్య శాఖ అధికారి అప్పయ్య వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన నగరంలోని గోపాల్‌పూర్ పీహెచ్‌సీతో పాటు పలు పీహెచ్‌సీలు, ఆయుష్మాన్ మందిర్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్య కేంద్రంలోని వ్యాక్సిన్ స్టోరేజీ, ఐఎల్ఆర్ రికార్డులు పరిశీలించి రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్ఓ అప్పయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా గర్భిణులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజేందర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సంపత్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న(గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని టీజీఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ప్రగతినగర్, రెవెన్యూ, సాయి కాలనీ, నాగేంద్రనగర్, జులైవాడ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, రాంపూర్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, కాజీపేట జూబ్లీ మార్కెట్, రహమత్ నగర్, కాజీపేట మెయిన్ రోడ్, వెంకటాద్రి నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, వడ్డేపల్లి, పరిమళ, సప్తగిరి, ఆర్టీసీ, పోలీసు, ఉషోదయ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్‌లోని వసంతపూర్, దూపకుంట ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శెంకేశి మల్లికార్జున్ తెలిపారు.

రాములవారికి పల్లకీ సేవ



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో జరుగుతున్న రామనవమి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు మహా సుదర్శన హోమం నిర్వహించారు. బుధవారం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు రుద్రేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం శ్రీరామున్ని పురుషోత్తముడిగా అలంకరించి హనుమత్ సమేత లక్ష్మణ శ్రీసీతారాములకు పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం యాగశాలలో సుదర్శన హోమం నిర్వహించారు.

ఎవరికీ పట్టని ఎంజీఎం!

ఆస్పత్రిలో పాలన అస్తవ్యస్తం
- అందుబాటులో లేని కెమికల్స్, మెడిసిన్స్
- భర్తీ కాని పాలనాధికారుల పోస్టులు..
- జాడ లేని వైద్యులు
- రోగులకు అరకొర సేవలు



గత కొన్ని నెలలుగా ఎంజీఎం ఆస్పత్రిని కెమికల్స్, ఔషధాల కొరత వేధిస్తోంది. వైద్య సిబ్బంది ఔషధాలు లేవంటూ.. రోగులను బయటకు పంపిస్తున్నారు. కానీ అధికారులు స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు. విచారణ చేసి అడిగిన రోజు మాత్రమే ఔషధాల కొరత ఉందని పేర్కొంటున్నారు. ఇలా ఆస్పత్రికి వచ్చే పేద రోగుల జేబులు ఖాళీ చేస్తూ పాలన వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు.

ఎంజీఎం: ఉత్తర తెలంగాణ ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో పాలన అస్తవ్యస్తంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినప్పటికీ ఆస్పత్రిలోని సమస్యలపై దృష్టి సారించకపోవడంతో పేద ప్రజలు ఎంజీఎం ఆస్పత్రికి రావడానికి జంకుతున్నారు. కొద్ది నెలల క్రితం ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో పెద్ద ఎత్తున ఆస్పత్రి వైద్యులు బదిలీ అయ్యారు. ఆ స్థానాలను భర్తీ చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఆస్పత్రిలో కొన్ని నెలలుగా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పాలన సాగుతోంది. ఎప్పటికప్పుడు సేవలను పర్యవేక్షించే ఆర్ఎంఓలు లేకపోవడం.. విధులకు వస్తున్న వైద్యులు ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియకపోవడంతో ఆస్పత్రిలో అన్ని వ్యవస్థలు కుప్పకూలుతున్నాయి. విభాగాల వారీగా సమస్యలు నెలకొనడంతో పాటు కనీసం నెల రోజుల్లో పూర్తి చేయాల్సిన టెండర్ ప్రక్రియలను నోటిఫికేషన్ వెలువడి 8 నెలలు కావొస్తున్నా పూర్తి చేయలేకపోతున్నారంటే పాలన ఎలా సాగుతుందో అర్థమవుతుంది.

అంతా గందరగోళం..
ఎంజీఎం ఆస్పత్రిలో ప్రతీ రోజు వేలాది మంది రోగులు చికిత్స పొందుతుంటారు. రోగుల సౌకర్యార్థం పాలనా విభాగంలో ముగ్గురు ఆర్ఎంఓలు, ఒక డిప్యూటీ సూపరింటెండెంట్, సూపరింటెండెంట్ నిత్యం పర్యవేక్షిస్తూ సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తూ ఉండాలి. కానీ.. సంవత్సర కాలానికి పైగా కీలకమైన ఆర్ఎంఓ-1, పదవి ఖాళీగా ఉంది. కాగా గత కొన్ని నెలల క్రితం డిప్యుటేషన్‌పై కొనసాగుతున్న ఆర్ఎంఓ-2ను బదిలీ చేశారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను నింపడంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో గత రెండు వారాల క్రితం ఆస్పత్రిలో కొనసాగుతున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైద్యులు, ఇన్‌చార్జ్ ఆర్ఎంఓలకు సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్ బాధ్యతలు అప్పగించారు. ఇదంతా ఒక ఎత్తయితే.. ఆస్పత్రి పాలన గాడిన పెట్టే పూర్తి స్థాయి సూపరింటెండెంట్‌ను నియమించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఆస్పత్రిలో పూర్తి స్థాయి సూపరింటెండెంట్‌ను నియమించాలని ఏకంగా ప్రతిపక్షాలు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మందుల కోసం క్యూ కట్టిన మహిళలు (ఫైల్)

9 నెలలైనా పూర్తి కాని టెండర్..
ఎంజీఎం ఆస్పత్రిలో పేద రోగులకు 80 శాతం ఔషధాలను సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ ద్వారా సరఫరా చేస్తుంటారు. అక్కడి నుంచి అందుబాటులోని ఔషధాలను 20 శాతం బడ్జెట్ ద్వారా టెండర్ ప్రక్రియ ద్వారా కొనుగోలు చేసి సరఫరా చేస్తుంటారు. ఈటెండర్‌ను సంవత్సరానికి ఒక్కసారి పిలుస్తుంటారు. ఈప్రక్రియ దాదాపుగా 15 రోజుల్లో పూర్తి చేస్తారు. కానీ ప్రస్తుతం ఆస్పత్రిలో అధికారుల కొరత.. పట్టింపులేని తనం వెరసి 9 నెలలు గడస్తున్నా.. టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. గత జూన్ 25న సర్జికల్స్ మెడికల్స్ ప్రక్రియకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ షెడ్యూల్ ప్రకారం జూలై 12వ తేదీ టెండర్ ఓపెన్ చేసి ప్రక్రియ పూర్తి చేయాలి. కానీ, అధికారుల నిర్లక్ష్యంతో నేటి వరకూ టెండర్ ప్రక్రియ పూర్తి చేయకుండా పాత కాంట్రాక్టర్లతో కొనాల్సిన దుస్థితి నెలకొంది.

త్వరలో పూర్తి చేస్తాం..



ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను 60 క్రితం చేపట్టాం. బాధ్యతలు చేపట్టినప్పటికీ వివాదాస్పదంగా ఉన్న ఏజెన్సీ ఉద్యోగుల వేతనాల చెల్లింపుల కోసం, 2 వేల పడకల ఆస్పత్రి సమీక్షలపై దృష్టి సారిస్తూ ముందుకు సాగాం. టెండర్ ప్రక్రియలను సైతం అతి త్వరలో పూర్తి చేస్తాం.
– కిశోర్, ఎంజీఎం సూపరింటెండెంట్

అంతిమయాత్రలో పాల్గొన్న జనం



రేణుకకు అశ్రునయనాలతో వీడ్కోలు - 8లో▸

దంతెవాడ ఎన్‌కౌంటర్‌లో మరణించిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు గుమ్మడవెల్లి రేణుకకు బుధవారం స్వగ్రామమైన దేవరుప్పుల మండలం కడవెండిలో అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. అంతకుముందు ప్రజాసంఘాలు, వామపక్ష, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, గ్రామస్తులు ఆమె మృతదేహం వద్ద ఘన నివాళులు అర్పించారు. - దేవరుప్పుల

తాగునీటికి ఇబ్బందులు తలెత్తవద్దు

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: క్షేత్ర స్థాయిలో ప్రజలకు తాగునీటి నీటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ గుండు సుధారాణి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో నీటి సరఫరా తీరును పరిశీలించే క్రమంలో మేయర్ బుధవారం నగర పరిధి వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్‌తో పాటు ధర్మసాగర్ నుంచి 1,000 ఎంఎల్‌డీ డయా పైప్ లైన్ ద్వారా నీటి సరఫరా జరిగే వాల్వ్‌ను కడిపికొండ రాజీవ్ గృహ కల్ప ప్రాంతంలో మేయర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాంపూర్, ఖిలా వరంగల్ ప్రాంతంలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. కడిపికొండ ప్రాంతంలో వాల్వ్‌ను పరిశీలించారు. నీటి సరఫరాలో ఏర్పడ్డ అవాంతరాలకు కారణాల్ని అధికారులను మేయర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాస్, రవికుమార్, సంతోశ్ బాబు, మహేందర్, మాధవీలత, డీఈలు సారంగం, కార్తీక్ రెడ్డి, ఏఈలు రామన్న, ముజామిల్, మేనక, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వ్యవసాయాధికారుల ఫోన్ నంబర్ల మార్పు

హన్మకొండ: హనుమకొండ జిల్లాలోని వ్యవసాయాధికారులు ఇప్పటి వరకు వినియోగించిన ఫోన్ నంబర్ల స్థానంలో కొత్త ఫోన్ నంబర్లను ప్రభుత్వం కేటాయించినట్లు హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సింగ్ తెలిపారు. రైతులు కొత్త ఫోన్ నంబర్లలో అధికారులను సంప్రదించాలని కోరారు. జిల్లా వ్యవసాయాధికారి బి.రవీందర్ సింగ్ 89777 56346, ఏఓ టెక్నికల్ డి.శ్రీధర్ రెడ్డి, 89777 56348, ఏఓ టెక్నికల్ టి.కమలాకర్ 89777 56349, ఏఓ టెక్నికల్ ఎండి అఫ్జల్ పాషా 89777 56350, హనుమకొండ ఏడీఈ 89777 44964, హనుమకొండ ఏఓ 89777 44968. హసన్‌పర్తి ఏఓ 89777 44969, కాజీపేట ఏఓ 89777 44971, హనుమకొండ ఏడీఏ పీపీ 89777 44975 నంబర్లు కేటాయించినట్లు వివరించారు.

చెత్తతో విద్యుత్ ఉత్పత్తి అద్భుతం

- కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద
- హైదరాబాద్‌లోని డంపింగ్ యార్డు పరిశీలన

వరంగల్ అర్బన్: చెత్తతో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం అద్భుతమని హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద అన్నారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డును వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం సందర్శించారు. ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతి, చెత్త నుంచి విద్యుత్ తయారీ, చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను పరిశీలించారు. డివిజన్ల నుంచి చెత్తను ఎలా తరలిస్తున్నారు? డంపింగ్ యార్డు వద్ద ఎలాంటి పద్ధతులను అనుసరిస్తున్నారు? చెత్తను ఎలా రీసైక్లింగ్ చేస్తున్నారనే విషయాలను క్షేత్ర స్థాయిలో అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చెత్త నుంచి కరెంట్, గ్యాస్‌ను తయారు చేస్తున్న విధానాన్ని ఇదే తరహాలో గ్రేటర్ వరంగల్‌లో అభివృద్ధి చేస్తామన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ చేపడుతున్న రాంకీ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ రాజారెడ్డి, సంబంధిత అధికారులు, రాంకీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ జవహర్ నగర్ డంపింగ్ యార్డు వద్ద హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు, గ్రేటర్ వరంగల్ కమిషనర్, అధికారులు

7నుంచి టెన్త్ స్పాట్

- 15 వరకు స్పాట్ వాల్యుయేషన్
- 2.27 లక్షలకుపైగా జవాబు పత్రాలు
- ఏఈలు, సీఈలు కలిపి 1,064 మంది
- స్పెషల్ అసిస్టెంట్లు 450 మంది
- కొనసాగుతున్న కోడింగ్, డీకోడింగ్
- ఉమ్మడి జిల్లా అంతటికీ కాజీపేటలోని ఫాతిమా హైస్కూల్‌లోనే క్యాంపు

విద్యారణ్యపురి: గత నెల 21 నుంచి ప్రారంభమైన టెన్త్ పరీక్షలు బుధవారం ముగిశాయి. చివరి రోజు సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహించారు. హనుమకొండ జిల్లాలో బుధవారం నిర్వహించిన టెన్త్ సోషల్ స్టడీస్ పరీక్షకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ వాసంతి తెలిపా రు. జిల్లా మొత్తం 67 పరీక్ష కేంద్రాలకుగాను.. 12,010 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 12,004 మంది హాజరైనట్లు, ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలోనే టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ క్యాంపును నిర్వహించనున్నారు. స్పాట్ కేంద్రమైన కాజీపేటలోని ఫాతిమా హైస్కూల్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 7 నుంచి 15 వరకు జవాబు పత్రాల వాల్యుయేషన్ ప్రక్రియ జరగనుంది.

సీనియార్టీ ప్రకారం ఎస్ఏలకు విధులు
ఉమ్మడి జిల్లాలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని టెన్త్ అన్ని సబ్జెక్టులకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్లలో సీనియార్టీ కలిగిన వారిని అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా (ఏఈ), చీఫ్ ఎగ్జామినర్లుగా (సీఈ) నియమించారు. హనుమకొండ డీఈఓ డి.వాసంతి క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. మిగతా జిల్లాలనుంచి వివిధ సబ్జెక్టులు బోధించే స్కూల్ అసిస్టెంట్ల వివరాలను తెప్పించుకుని సీనియార్టీ ప్రాతిపదికన నియమించారు. ఏఈలు, సీఈలు కలిపి మొత్తం 1,064 మంది స్కూల్ అసిస్టెంట్లను నియమించారు. ఈమేరకు వారికి నియామక ఉత్తర్వులు కూడా పంపుతున్నారు. స్పెషల్ అసిస్టెంట్లుగా 450 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ)లను కూడా నియమించారు. అవసరం కంటే ఎక్కువ మందిని కూడా తీసుకున్నారు. కొంత మంది స్కూల్ అసిస్టెంట్లు మెడికల్ ఇతర కారణాలు చూపి స్పాట్‌కు రాలేకపోతే మిగతా వారికి అవకాశం ఇస్తారు.

ఈనెల 7న ఉదయం రిపోర్టు చేయాలి
కాజీపేటలోని టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో ఈనెల 7న ఉదయం 9 గంటల నుంచి ఆయా ఉపాధ్యాయులు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. వాల్యుయేషన్‌లో తీసుకోవాల్సిన పలు అంశాలను సంబంధిత అధికారులు వారికి తెలియజేస్తారు. అనంతరం వాల్యుయేషన్ చేస్తారు. రోజుకు 40 జవాబు పత్రాలు దిద్దుతారు. ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విధుల్లో పాల్గొంటారు.

జవాబుపత్రాలు రాక..
ఉమ్మడి జిల్లా క్యాంపునకు టెన్త్‌లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్, మ్యాథ్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు సంబంధించి జవాబుపత్రాలు 2.27 లక్షలకు పైగా చేరుకున్నాయి.

కొనసాగుతున్న కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియ
ఇప్పటికే చేరుకున్న టెన్త్ పరీక్షల జవాబు పత్రాలకు కాజీపేట ఫాతిమా హైస్కూల్‌లో కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. కోడింగ్ ఆఫీసర్లుగా ఇద్దరు పీజీ హెచ్ఎంలు వ్యవహరిస్తుండగా.. మరో 8 మంది అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియ ముగియనున్నది. ఆ తరువాత వాల్యుయేషన్ ప్రారంభమవుతుంది.

టార్గెట్.. 2.50 లక్షల మంది

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లానుంచి జనసమీకరణ
- ఇన్‌చార్జులుగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కమిటీలు
- ఇప్పటికే కేసీఆర్‌తో భేటీ అయిన ముఖ్య నేతలు

సాక్షిప్రతినిధి, వరంగల్/ఎల్కతుర్తి : వరంగల్ వేదికగా ఈ నెల 27న బీఆర్ఎస్ మరోసారి ప్రతిష్టాత్మక కార్యక్రమం నిర్వహించేందుకు బుధవారం అంకురార్పణ జరిగింది. పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకల మహాసభ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సభా పర్యవేక్షకులు, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నరేందర్, ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ గ్యాదరి బాలమల్లు తదితరులు భూమి పూజ చేశారు. అంతకుముందు మంగళవారం ఎర్రవెల్లిలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన ముఖ్యనేతలతో సమావేశమైన అధినేత కేసీఆర్.. సభావేదిక, జనసమీకరణ, ఇతర ఏర్పాట్లకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. 10లక్షలకు పైగా మందితో బహిరంగసభ నిర్వహించాలని, దీనికి కోసం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 2.50 లక్షల మందిని సమీకరించాలని టార్గెట్ పెట్టారు.



సభాస్థలంలో పనులు ప్రారంభిస్తున్న హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, చిత్రంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్ కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నరేందర్ తదితరులు

జన సమీకరణకు ఇన్‌చార్జ్‌లు..
కేసీఆర్ ఆదేశాలతో 2.50లక్షలమంది జనసమీకరణకు బీఆర్ఎస్ పార్టీ నేతలు కసరత్తు ప్రారంభించారు. ఈమేరకు అధినేత.. సభా ఏర్పాట్లు, జన సమీకరణకు సంబంధించి ముఖ్యనేతలకు నియోజకవర్గాల వారీగా బాధ్యతలు అప్పగించారు. పాలకుర్తి, వర్ధన్నపేటకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనుండగా.. వరంగల్ పశ్చిమను మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌కు అప్పగించారు. వరంగల్ తూర్పును నన్నపునేని నరేందర్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి, భూపాలపల్లిని గండ్ర వెంకటరమణారెడ్డికి, నర్సంపేట, ములుగు నియోజకవర్గాలకు పెద్ది సుదర్శన్‌రెడ్డిని ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. అదేవిధంగా జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ బాధ్యతలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చూడనుండగా, పరకాలను చల్లా ధర్మారెడ్డి, మహబూబాబాద్‌ను సత్యవతి రాథోడ్, శంకర్ నాయక్, డోర్నకల్‌ను రెడ్యానాయక్, మాలోత్ కవితకు అప్పగించారు. సభ ఏర్పాట్లు, జన సమీకరణ తదితర బాధ్యతలు నిర్వహించే హైదరాబాద్‌కు చెందిన పార్టీ రాష్ట్ర, జాతీయస్థాయి నాయకులు వరంగల్ నగరంలోనే మకాం వేయనున్నారు.

నేటి నుంచి మరింత వేగంగా పనులు..
సభకు మరో 24 రోజులే గడువు ఉండడంతో గురువారంనుంచి సభ కోసం చేపట్టే పనులు మరింత వేగం పుంజుకోనున్నాయి. ఇప్పటివరకు బహిరంగ సభకు సిద్ధం చేసిన 1,213 ఎకరాల స్థలంలో.. 154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం ఉంటుందని, పార్కింగ్ కోసం 1,059 ఎకరాలను కేటాయించినట్లు వెల్లడించిన బీఆర్ఎస్ నేతలు, మరో మూడు, నాలుగు వందల ఎకరాలు కూడా సేకరించనున్నట్లు వివరించారు.

ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

వరంగల్ అర్బన్: లేఔట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) 25 శాతం రాయితీ గడువు ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు పురపాలక ప్రిన్సిపల్ సెక్రటరీ కిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా.. గ్రేటర్ వరంగల్ పరిధిలో 16వేల మంది ఇప్పటికే రాయితీని వినియోగించుకున్నారు. తద్వారా బల్దియాకు రూ.102 కోట్ల ఆదాయం సమకూరింది. గడువు పొడిగింపుతో మరో 50 వేల మంది రాయితీని వినియోగించుకునే అవకాశాలున్నాయి.

ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ
బల్దియా పరిధిలో ఈ నెలాఖరు(ఏప్రిల్30) తేదీలోగా ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించినందుకు రాయితీని కల్పించారు. నెలాఖారులోగా పన్నులు చెల్లించి మహానగర అభివృద్ధికి చేయూతనివ్వాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ విజ్ఞప్తి చేశారు.

'చపాట'కు అంతర్జాతీయ గుర్తింపు

- 'తిమ్మంపేట' మిరపకు జీఐ ట్యాగ్ సర్టిఫికెట్ జారీ
- సొంత లోగో, బ్రాండ్‌తో అమ్ముకునే వీలు

సాక్షి, వరంగల్/దుగ్గొండి: గ్రామీణ ప్రాంతాల్లో 80 ఏళ్ల నుంచి రైతులే విత్తనాలు తయారు చేసుకుని పండిస్తున్న వరంగల్ చపాట మిరప ఇక అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందనుంది. 2024 నవంబర్‌లోనే ఈ మిరపకు అంతర్జాతీయస్థాయి భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) లభించినా.. తాజాగా ఉగాది పండుగ వేళ తిమ్మంపేట మిరప రైతు ఉత్పత్తిదారుల సంఘానికి పేటెంట్ కల్పిస్తూ కేంద్ర భౌగోళిక గుర్తింపు సంస్థ ఉత్తర్వులిచ్చింది. చెన్నైలోని ఇండియన్ పేటెంట్ సంస్థ జీఐ ట్యాగ్ సర్టిఫికెట్ జారీ చేసింది. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేట మిరప రైతు ఉత్పత్తిదారుల సంఘం ఈచపాట మిర్చికి భౌగోళిక గుర్తింపు కోసం ఇండియన్ పేటెంట్ ఆఫీస్ చెన్నై సంస్థకు 2022లో దరఖాస్తు చేస్తే మూడేళ్లకు అధికారికంగా పేటెంట్ లభించింది. వరంగల్ చపాట మిరపలో రంగు ఎక్కువగా ఉండడం, కారం తక్కువగా ప్రత్యేక లక్షణాలు కలిగి ఉండడంతో 18వ ఉత్పత్తిగా జీఐ ట్యాగ్ లభించింది.



వరంగల్ చపాట మిరప తోట

ఫలించిన తిమ్మంపేట మిరప రైతుల కృషి..
దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలో 300 మంది మిరప రైతులు తిమ్మంపేట చిల్లీ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ లిమిటెడ్ పేరున రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకొని మిర్చికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొచ్చారు. తమ సొంత లోగో, బ్రాండ్ ఏర్పాటు చేసుకుని ఇతర రాష్ట్రాలు, దేశాలకు అమ్ముకునే అవకాశం కలిగింది. ప్రస్తుతం వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి జిల్లాలో చపాట మిర్చి 6,738 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ప్రతీ ఏడాది 10,951 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేస్తున్నారు. దాదాపు 20,574 మంది రైతులు జీఐ ట్యాగ్ ద్వారా లబ్ధి పొందనున్నారు.

క్లుప్తంగా

బధిరుల పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులు

హన్మకొండ అర్బన్ : తిరుమల తిరుమతి దేవస్థానం ఆధ్వర్యంలో నగరంలోని ప్రగతి నగర్ కాలనీ ఫేజ్–2లో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాలలో 2025–26 సంవత్సరానికి గాను 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అడ్మిషన్లు పొందడానికి ఈనెల 2 నుంచి జూన్ 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.లక్ష్మీనర్సమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యార్థి దివ్యాంగ సదరం, బర్త్, స్టడీ, కులం, ఆదాయ ధ్రువీకరణ ప్రతాలు, ఆధార్, రేషన్ కార్డులు, పాస్ ఫొటోలు (04) దరఖాస్తు ఫామ్‌లతో జత చేసి అందజేయాలన్నారు. ప్రవేశం పొందిన వారికి 1 నుంచి 10వ తరగతి వరకు ఉచిత హాస్టల్ వసతితో పాటు బోధన ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 08702459374, 9440739423, 8008136309 నంబర్లలో సంప్రదించాలని లేదా శ్రీ వెంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాల, మయూరి గార్డెన్ లైన్, ప్రగతి నగర్ కాలనీ ఫేజ్ -2, ఎన్ఐటీ, హనుమకొండలో నేరుగా సంప్రదించాలని పేర్కొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ల పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువును పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ వెంకటయ్య బుధవారం తెలిపారు.అపరాధ రుసుము లేకుండా ఈనెల 7వతేదీ వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 9వతేదీవరకు గడువు ఉందన్నారు. ఫీజుల వివరాలు, పూర్తి సమాచారం సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో ఉందని వారు తెలిపారు.

కాజీపేట జంక్షన్ మీదుగా 18 రైళ్ల సర్వీస్‌లు

- సుబేదార్‌గంజ్–సికింద్రాబాద్ మధ్య రాకపోకలు..

కాజీపేట రూరల్ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా సుబేదార్‌గంజ్–సికింద్రాబాద్, సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ మధ్య 18 రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ఏ. శ్రీధర్ బుధవారం తెలిపారు.

రైళ్ల వివరాలు..

సుబేదార్‌గంజ్–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ సుబేదార్‌గంజ్‌లో ఈ నెల 3వ తేదీ నుంచి ప్రతీ గురువారం బయలుదేరే ఈ రైలు మే 29వ తేదీ వరకు ఆయా నగరాల మధ్య 9 సార్లు నడుస్తుంది. అదేవిధంగా సికింద్రాబాద్‌లో ప్రతీ శనివారం బయలుదేరే ఈ రైలు ఈ నెల 5వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు ఆయా నగరాల మధ్య 9 సార్లు నడుస్తుందని ఆయన తెలిపారు. థర్డ్ ఏసీ, స్లీపర్‌క్లాస్, జనరల్ కోచ్‌లతో ప్రయాణించే ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లకు ఫత్తేపూర్, గోవింద్‌పూర్, భీమ్‌సేన్, పోక్‌ర్యాన్, ఒరాయ్, ఝాన్సీ, బీనా, రాణి కమలాపేట్, ఇటార్సీ, నాగ్‌పూర్, బల్హార్షా, సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కాజీపేట రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు సీపీఆర్వో తెలిపారు.

ఎటు చూసినా.. ఎర్ర బంగారమే!

వరంగల్ మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

- లక్షా బస్తాల రాక..ఎరుపు రంగు పులుముకున్న ఏనుమాముల యార్డులు
- సరుకు పెరిగింది.. ధర తగ్గింది
- ఎంట్రీలు లేక బస్తాల లెక్కల్లో తేడా



మిర్చి బస్తాలతో నిండిన వరంగల్ వ్యవసాయ మార్కెట్

వరంగల్: ఏనుమాములకు ఎర్ర బంగారం పోటెత్తింది. సీజన్ ఊపందుకోవడంతోపాటు వారాంతపు సెలవులు శని, ఆదివారం, ఉగాది, రంజాన్ పండుగలతో వరుసగా నాలుగు రోజులు వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మార్కెట్ బుధవారం పునఃప్రారంభమైంది. దీంతో సుమారు 95వేలకు పైగా మిర్చి బస్తాలు వచ్చాయి. ఫలితంగా మార్కెట్‌లోని యార్డులతో పాటు బహిరంగ ప్రదేశాలు సైతం మిర్చి బస్తాలతో నిండిపోయాయి. కాగా, ఇంత పెద్ద మొత్తంలో మిర్చి రావడంతోనే ధరలను తగ్గించారని రైతులు ఆరోపిస్తున్నారు. పెద్ద మొత్తంలో ఒకే రోజు బస్తాలు రావడం.. ఎండలు పెరిగిపోవడంతో మార్కెట్‌లోని దడువాయిలు లాట్ ఐడీలు కొట్టడం, హమాలీ కార్మికులు కాంటాలు పెట్టడంలో జాప్యం జరుగుతోందని రైతులు వాపోతున్నారు. అన్ని రకాల మిర్చి రావడంతో ఘాటు పెరిగి కార్మికులు, రైతులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు రాష్ట్రంలోని ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున మిర్చి తరలివస్తోంది.

ఎంట్రీలు లేక లెక్కల్లో తేడా..

గతంలో మార్కెట్‌లోకి వచ్చే ప్రతీ వాహనం, అందులోని బస్తాల వివరాలను గేటు వద్ద ఉన్న ఉద్యోగులు నమోదు చేసే వారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. గేటు వద్ద ఎంట్రీ చేసే విధానాన్ని ఎత్తివేశారు. దీంతో ఎన్ని బస్తాలు వస్తున్నాయో సిబ్బంది, అధికారులకే తెలియాలి. ఈ విధానం వల్ల వచ్చిన బస్తాల్లో ఎన్ని జీరో అవుతున్నాయో అంతుచిక్కడం లేదు. రోజూ కనీసం 5వేలకు పైగా బస్తాలు జీరో జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

క్వింటాకు రూ.5వేలు తక్కువ..

గతేడాది ధరలతో పోల్చుకుంటే ఈఏడాది తేజ, యూఎస్ 341, డీడీ, వండర్‌హాట్ తదితర రకాల మిర్చికి క్వింటాకు రూ.5వేలకు పైగా ధరలు తగ్గాయని రైతులు ఆరోపిస్తున్నారు. దిగుబడి తగ్గిందని బాధ పడుతుంటే ధరలు సైతం తగ్గడంతో పెట్టుబడులు రాని పరిస్థితులు నెలకొన్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.లక్షన్నర నష్టం..



ప్రస్తుతం ఉన్న ధరతో నాకు ఎకరాకు రూ. లక్షన్నర నష్టం వస్తోంది. 341రకం మిర్చి 42 బస్తాలు తెచ్చా. 11వేలు ధర నిర్ణయం అయ్యింది. నాకు రూ.9వేలు పడింది. గతేడాది ఇదే రకం రూ.14,600 ఉండగా రూ.12,500 పడింది. క్వింటా కాయ కోయాలంటే రూ.4,500తో పాటు ఇతర ఖర్చులు కలిపితే మార్కెట్‌కు వచ్చే వరకు రూ.6,500 పడుతోంది.

-లక్ష్మయ్య, ఏటూరునాగారం, ములుగు జిల్లా

ఏసీలో పెట్టి నష్టపోయా..



ధరలు పెరుగుతాయనే ఆశతో గతేడాది ఏసీలో పెట్టగా నష్టపోయా. ఈఏడాది 341 మొదటి రకం ఉన్నా క్వింటాకు రూ.11,200 పడింది. ఇదే మిర్చి గతేడాది రూ.14 వేలకు కొనుగోలు చేశారు. కూలీ మనిషికి రూ.400 ఇవ్వాల్సి వస్తోంది. గిట్టుబాటు కావడం లేదు.

-ఎన్నపురెడ్డి రమేశ్, బొమ్మాపూర్, భూపాలపల్లి జిల్లా

క్వింటాకు రూ.5వేలు తగ్గింది..



మార్కెట్‌కు 60బస్తాలు డీడీ రకం మిర్చి తెచ్చా. గతేడాది ఇదే రకానికి రూ.16వేలు పలికింది. అదే రకం ఈసారి రూ.10,500 పడింది. నియంత్రణ లేక పోవడం వల్లే వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారు.

-బాలమల్లు, పెంకిన గ్రామం, పలిమెల మండలం, భూపాలపల్లి జిల్లా

గంటలోనే కేసు ఛేదన

- పోగొట్టుకున్న గొలుసు బాధితురాలికి అప్పగింత



బాధిత మహిళకు గొలుసు అప్పగిస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం : నగరంలోని గోకుల్ నగరానికి చెందిన సహేరా బేగం బంగారు గొలుసు పోగొట్టుకుంది. విషయాన్ని సుబేదారి పోలీసులకు తెలపడంతో గంట వ్యవధిలోనే వెతికి తిరిగి బాధితురాలికి అప్పగించారు సుబేదారి పోలీసులు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సహేరా బేగం బుధవారం ఉదయం 7 గంటలకు తన నివాసం నుంచి నిత్యావసరాల తీసుకురావడానికి దగ్గరలోని కిరాణం షాప్‌కి వెళ్లి వస్తుండగా మార్గమధ్యంలో మెడలోని 30 గ్రాముల బంగారు గొలుసు పోగొట్టుకుంది. ఇంటికి వెళ్లి చూసుకోగా మెడలో గొలుసు కనిపించకపోవడంతో కంగారుపడింది. వెంటనే సుబేదారి పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఎస్సై సుమన్ దరఖాస్తు ఇవ్వగా క్రైం కానిస్టేబుల్ ప్రభాకర్ వెంటనే స్పందించి చాకచక్యంతో బంగారు గొలుసును వెతికి తిరిగి బాధిత మహిళకు అప్పగించారు. క్రైమ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌ను ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి అభినందించారు.

కేంద్ర మంత్రి నాయుడిని కలిసిన ఎంపీ కావ్య



కేంద్ర మంత్రితో వరంగల్ ఎంపీ కడియం కావ్య

హన్మకొండ చౌరస్తా: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడిని వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం న్యూఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి, ఎయిర్‌క్రాఫ్ట్ కార్యకలాపాలను వేగవంతం చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూసేకరణకు రూ.205 కోట్లను విడుదల చేసిన విషయాన్ని కేంద్ర మంత్రి నాయుడుకు వివరించారు. రోడ్డు కనెక్టివిటీ, మౌలిక వసతుల కల్పన, భూసేకరణ అనంతరం విమాన రాకపోకలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర మంత్రి తెలిపినట్లు ఎంపీ కావ్య పేర్కొన్నారు.

కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా రాజు



రాజుకు ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ. రాజు నియమితులయ్యారు.ఈమేరకు రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. వీసీ కె. ప్రతాప్‌రెడ్డి బుధవారం సాయంత్రం రాజుకు ఆ ఉత్తర్వులు అందజేశారు. ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా బాధ్యతలలలు నిర్వర్తించిన కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ టి. రాజమణి నుంచి రాజు ఒకటి రెండురోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో గొడవ

- లోడ్ లారీలను వెళ్లనీయకుండా అడ్డుకున్న ఓ వర్గం
- అసోసియేషన్ లెక్కలు చూపించాలంటున్న మరో వర్గం



లారీలను అడ్డుకుంటున్న ఓ వర్గం

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ (కొత్త బీట్‌బజార్) పక్కన ఏర్పాటు చేసుకున్న ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో రెండు వర్గాల మధ్య గొడవ మరింత ముదిరింది. తాజాగా బుధవారం ఓ వర్గం వారు మరో వర్గానికి చెందిన లారీలను ఎరువుల బస్తాలను అన్‌లోడ్ చేయడానికి తీసుకుని వెళ్తుండగా ఎత్తుగడ్డ ఎఫ్‌సీఐ గోదాం ప్రాంతంలో అడ్డుకున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలిసిన గీసుకొండ ఎస్సై ప్రశాంత్‌బాబు అక్కడికి చేరుకుని సమస్యలు ఉంటే మామునూరు ఏసీపీ వద్ద మాట్లాడుకోవాలని వారికి నచ్చజెప్పి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ట్రాఫిక్ క్లియర్ అయినా సాయంత్రం వరకు వైరి వర్గం వారు లారీల్లోని బస్తాలను అన్‌లోడ్ చేయకుండా అడ్డుకున్నారు. గతంలో లారీ ఓనర్స్ అసోసియేషన్‌ను ఏనుమాముల ప్రాంతంలో నిర్వహించేవారు. కొన్ని సంవత్సరాల క్రితం కొత్త బీట్ బజార్ పక్కన ఏర్పాటు చేసుకున్నారు. అసోసియేషన్‌లో ఓ వర్గం వారు చాలా ఏళ్లుగా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని, లారీల కిరాయి ద్వారా వచ్చిన రూ.కోటికి పైగా డబ్బు లెక్కలు చూపించడం లేదని, గడిచిన 30 నెలల లావాదేవీల లెక్కలు చెప్పడం లేదని, ఏమైనా అంటే అసోసియేషన్ ఎన్నికల తర్వాత లెక్కలు చూపిస్తామంటూ దాటవేస్తూ బెదిరిస్తున్నారని మరో వర్గం వారు ఆరోపిస్తున్నారు. తాజాగా ఓ వర్గం వారు పోలీసు అధికారులతో మాట్లాడేందుకు వెళితే, మరో వర్గం వారు తమకు న్యాయం చేయాలంటూ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

నేడు ఆజంజాహిమిల్స్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లోకల్ కోర్టు

హన్మకొండ: వినియోగదారుల సమస్యల పరిష్కారానికి గురువారం వరంగల్ ఆజంజాహిమిల్స్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ ఎన్వీ వేణుగోపాలాచారి తెలిపారు. విద్యుత్ సంబంధ సమస్యలపై రాత పూర్వకంగా ఫిర్యాదులు అందించి పరిష్కరించుకోవచ్చని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్ నగరంలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేణుకకు అశ్రునయనాలతో వీడ్కోలు

ఎరుపెక్కిన కడవెండి..

- ప్రజాసంఘాలు, పార్టీ నేతల ఘన నివాళి
- కళాకారుల ఆటాపాటలతో దద్దరిల్లిన వీధులు
- నాలుగున్నర గంటలపాటు సాగిన అంతిమయాత్ర



'ఆపరేషన్ కగార్' ఆపాలని నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

దేవరుప్పుల : దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు గుమ్ముడవెల్లి రేణుక అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. బుధవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో దొడ్డి కొమురయ్య స్మారక స్తూపం వద్ద సందర్శనార్థం రేణుక మృతదేహం ఉంచగా పలువురు ఘన నివాళులర్పించారు. ఉదయం 12. 33 నిమిషాలకు ప్రారంభమైన అంతిమయాత్ర సాయంత్రం 4.44 నిమిషాల వరకు కొనసాగింది. ఆట,పాట, డప్పుళ్లతో కడవెండి వీధులు దద్దరిల్లాయి. ఆదివాసీ ఐక్య వేదిక, అమరుల బంధుమిత్రులు తదితర కమిటీలు 'ఆపరేషన్ కగార్' సత్వరమే ఆపేయాలని ఫ్లెక్సీల ప్రదర్శనతో డిమాండ్ చేశాయి.

ప్రజాసంఘాల ఘన నివాళి..

రేణుక మృతదేహానికి అమరవీరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షురాలు పద్మ కుమారి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, నారాయణరావు, వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్, శాంతక్క, విరసం నాయకుడు పాణి, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు రవి చందర్, బి రమాదేవి, చైతన్య మహిళా సంఘం నాయకురాలు అనురాధ, కళ, మొగిలిచర్ల భారతక్క, గాజర్ల అశోక్ అలియాస్ ఐతు, ఉస్మానియ యూనివర్సిటీ నాయకులు పృథ్వీ, స్టాలిన్, డీటీఎఫ్ నాయకులు సుదర్శన్, ఇప్ప రాంరెడ్డి, మా భూమి సంధ్య, వేముల పుష్ప, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నిర్వాహకురాలు పల్స నిర్మల, ప్రజాకళామండలి నుంచి రాజనర్సింహ, జర్నలిస్టు నాయకులు ఎంపీ రమణ, స్నేహలత, వనజ, మలుపు బాల్‌రెడ్డి, గద్దర్ కొడుకు సూర్యం, వరవరరావు కూతుళ్లు అనల, సహజ, పవన, కటకం సతీశ్, సింగరేణి కార్మిక సంఘ్య నాయకుడు హుస్సేన్, తెలంగాణ యూత్ ఫెడరేషన్ నాయకుడు పనికెర మోహన్ రాజు, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, తెలంగాణ ఉద్యమకారులు సీఎల్ యాదగిరి, చెరుకు సుధాకర్, రెడ్‌ఫ్లాగ్ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్ కన్నా నివాళులర్పించారు.



రేణుక మృతదేహం వద్ద కుటుంబీకులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి, పల్లాల నిలదీత..

రేణుక మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రేణుక సోదరుడు జీవీకె ప్రసాద్ తన చెల్లిని పాలక వర్గాలు అన్యాయంగా పొట్టనబెట్టుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రదర్శనలో కలిసి వచ్చే క్రమంలో బూటకపు ఎన్‌కౌంటర్లు, అణిచివేత మీ పాలనలో అనుభవించామని, ప్రస్తుతం బీజేపీ సర్కారు చేపడుతున్న 'ఆపరేషన్ కగార్'పై బీఆర్ఎస్ వైఖరి చెప్పాలని పలువురు నిలదీశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు గమనించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తాము వ్యతిరేకమని చెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు.

ప్రజా ఉద్యమకారులపై రాజ్యహింస కొనసాగింపు..

దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో కొనసాగుతున్న ప్రజా ఉద్యమకారులపై కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రతిపక్షాలతో కలిసి రాజ్యహింస కొనసాగిస్తోందని పౌరహక్కుల సంఘం, ఎబీఎంసీ, విరసం రాష్ట్ర ప్రతినిధులు గడ్డం లక్ష్మణ్, పద్మకుమారీ, పాణి, మాజీ మావోయిస్టు గాదె ఇన్నయ్య అన్నారు. రేణుక హత్యపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ కగార్'తో పాలకవర్గంచేపట్టే హంతక చర్యలను ప్రతిపక్షాలు నిలువరించే విషయం విస్మరిస్తే ప్రశ్నించే గొంతుకలు కనుమరుగువడమేగాక రాజ్యహింస హెచ్చుమీరుతుందని హెచ్చరించారు.

16 కిలోల గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ సతీశ్

వరంగల్ క్రైం: హనుమకొండ బస్టాండ్ వద్ద 16 కిలోల గంజాయి పట్టుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్ తెలిపారు. బుధవారం గుజరాత్‌కు చెందిన గౌతం భరత్‌సింగ్ వరంగల్ రైల్వే స్టేషన్‌లో రైలు దిగాడు. ఇక్కడ పోలీసులు తనిఖీ చేస్తుండగా అప్రమత్తమై ఆటోలో హనుమకొండ బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఇక్కడి నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వెళ్లడానికి సిద్ధంగా ఉన్న సమయంలో పోలీసులకు అనుమానం వచ్చి అతడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. ఇందులో 16 కిలోల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సతీశ్ తెలిపారు.

ఆయిల్ రూపంలో గంజాయి సరఫరా..

- జనగామలో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు
- రూ.13.42 లక్షల విలువైన సరుకు స్వాధీనం



పోలీసుల అదుపులో గంజాయి ఆయిల్ సరఫరా చేస్తున్న వ్యక్తులు

జనగామ: ఏపీ నుంచి ఆయిల్ రూపంలో ఉన్న గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడిన ఘటన బుధవారం జిల్లా కేంద్రం నెహ్రూ పార్కు ఏరియాలో చోటు చేసుకుంది. ఎస్సై భరత్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలానికి చెందిన ఏజెంట్లు సురేశ్, నవీన్ మధ్యవర్తుల ద్వారా గంజాయి ఆయిల్‌ను రవాణా చేస్తున్నారు. ఇదే మండలానికి చెందిన గాలి రాహుల్ గాంధీ, సుక్రిల్ లైకాన్ ఆశీష్ పేరుతో ఉన్న ఆయిల్ గంజాయి కవర్లను వెంట తీసుకుని వైజాగ్ నుంచి ఈస్ట్‌కోస్ట్ రైలులో హైదరాబాద్ బయలుదేరారు. మార్గమధ్యలో రైలులో పోలీసులు తనిఖీ చేస్తున్నట్లు గుర్తించిన ఆ ఇద్దరు జనగామ రైల్వేస్టేషన్‌లో దిగి.. నెహ్రూపార్కు ఏరియాకు నడుచుకుంటూ బయలుదేరారు. జంక్షన్‌లో ఎస్సై భరత్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల ను తనిఖీ చేస్తుండగా, వారిని చూసి అనుమానాస్పదంగా వ్యవహరించడంతో వెంటనే పట్టుకున్నారు. తనిఖీ చేయగా, గంజాయితో తయారు చేసిన ఆయిల్ కవర్లను లభించాయి. దీని విలువ రూ.13.42 లక్షలు ఉంటుంది. చింతపల్లికి చెందిన ఏజెంట్లు సురేశ్, నవీన్ ద్వారా ఇద్దరు వ్యక్తులు రాహుల్‌గాంధీ, లైకాన్ రూ.8వేలకు మాట్లాడుకుని హైదరాబాద్‌లోని ఓ వ్యక్తికి ఇచ్చేందుకు వైజాగ్ నుంచి బయలుదేరినట్లు ఎస్సై తెలిపారు. ఈఘటన నపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై చెప్పారు.

ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తుల స్వీకరణ

వరంగల్: ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో సైతం రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరిస్తారని రాజీవ్ యువ వికాసం వరంగల్ జిల్లా నోడల్ అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వర్ల డౌన్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఏర్పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. దీంతో ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకునేందుకు అనుమతించారని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు మున్సిపాలిటీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల (హెల్ప్‌డెస్క్) వద్ద దరఖాస్తులను ఉచితంగా పొందవచ్చని వివరించారు. సర్వర్లలో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు రాష్ట్ర కార్యాలయంలోని టెక్నీషియన్లు, ఐటీ శాఖ అధికారులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం యవత కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకుంటే మొదటి ప్రాధాన్యతగా సర్టిఫికెట్లను జారీ చేయాలని కలెక్టర్ తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

హైటెక్ వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- నిర్వాహకురాలు, విటులు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నగదు చూపుతున్న టాస్క్‌ఫోర్స్, సుబేదారి పోలీసులు

వరంగల్ క్రైం : సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో హైటెక్ వ్యభిచార ముఠా గుట్టు రట్టు అయ్యింది. పోస్టల్ కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం టాస్క్‌ఫోర్స్, సుబేదారి పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించి వ్యభిచారం గృహం నిర్వహిస్తున్న ఓ మహిళ, నలుగురు విటులను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా వేలేరు మండలం శోడషపల్లి గ్రామానికి చెందిన తిమ్మాపురం లలిత సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో పోస్టల్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను తీసుకొచ్చి రహస్యంగా సంవత్సర కాలంగా వ్యభిచారం నిర్వహిస్తోంది. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి నిర్వాహకురాలు లలితతోపాటు విటులు జనగామకు చెందిన బంతిని అశోక్, బుక్క కరుణాకర్, ఘన్‌పూర్ మండలం మీదికొండకు చెందిన వడ్లకొండ రమేశ్, కాజీపేట విష్ణుపురికి చెందిన బొల్లి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి బాధిత మహిళలను కాపాడినట్లు తెలిపారు. వీరి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.2,450 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తదుపరి విచారణ కోసం నిందితులను సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ తెలిపారు.